క్లుప్తంగా

పదిలో భాష్యం విజయకేతనం



నెల్లూరు(అర్బన్): పదో తరగతి ఫలితాల్లో భాష్యం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ తెలిపారు. నగరంలోని భాష్యం క్యాంపస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఎం మేఘన 588, పావని 586, సూర్యపుష్పక్ 579, జస్వంత్ 578, డింపుల్ శ్రీయ 573 మార్కులు సాధించారని తెలిపారు. పరీక్షలకు 21 మంది విద్యార్థులు హాజరుకాగా, 570 మార్కులకు పైగా ఐదుగురు, 550కు పైగా 8 మంది, 500కుపైగా 8 మంది సాధించారని వివరించారు.

వీబీఆర్ విద్యార్థుల సత్తా




నెల్లూరు(అర్బన్): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారని ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ రెసిడెన్షియల్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ కాటం శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు టీ తేజస్విని, వీ మధురిమ 591, భువనశ్రీ, లక్ష్మీనరసింహ 590 మార్కులను సాధించి టాపర్లుగా నిలిచారని వివరించారు. 580కుపైగా 21 మంది, 570కు పైగా 37 మంది సాధించారని తెలిపారు.

పది విద్యార్థులకు అభినందన

నెల్లూరు(అర్బన్): నగరంలోని శ్రీలక్ష్మి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎం చరిష్మా 591 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిందని తెలిపారు. 500కు పైగా మార్కులు 12 మంది సాధించారని వివరించారు.

ఎంజీబీ మాల్ అధినేత గంగాధర్‌తో ఆదాల భేటి



నెల్లూరు సిటీ: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంజీబీ మాల్ అధినేత ఎం గంగాధర్‌ను నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ విజయానికి సహకారం అందించాలని కోరారు. నగర మేయర్ స్రవంతి, సీహెచ్ హరిబాబుయాదవ్, లంక రామశివారెడ్డి, క్లస్టర్–2 అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, సీనియర్ ముస్లిం మైనార్టీ నాయకులు సమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

కృష్ణచైతన్య విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు(అర్బన్): విక్రమ సింహపురి వర్సిటీ బుధవారం విడుదల చేసిన పీజీ, ఎంబీఏ, ఎంసీఏ సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ కళాశాల డైరెక్టర్లు ఆర్వీ కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రానా ప్రమోదరెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంసీఏలో వెంకటకామాక్షి వైష్ణవి 85.5 శాతం, ఎంబీఏలో జ్ఞానేశ్వరి, అలీషా 75 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో హర్షంక 82.5 మార్కులతో ప్రథమ స్థానం పొందారన్నారు. పీజీ కళాశాల డీన్లు మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): షిఫ్ట్‌ఆపరేటర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని విద్యుత్ డీఈఈ మధుసూదన్‌రెడ్డి సూచించారు. జనార్దన్‌రెడ్డికాలనీలోని జగనన్న కాలనీ నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న షిఫ్టు ఆపరేటర్లకు నిర్వహణ బాధ్యతలను బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా డీఈఈను షిఫ్ట్ ఆపరేటర్లు సత్కరించారు. అనంతరం డీఈఈ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరపురం, జగనన్నకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వేషన్లు తొలగిస్తామంటున్న కూటమిని ఓడించండి



43 డివిజన్‌లో ప్రచారం చేస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ముస్లింలకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను ఎత్తివేస్తామంటున్న బీజేపీతో పొత్తుపెట్టుకున్న టీడీపీతో ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని, ఆ పార్టీ అభ్యర్థులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 43వ డివిజన్‌లో నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌తో కలసి బుధవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. ముస్లింల సంక్షేమం, లౌకికవాదంపై ఉపన్యాసాలు దంచే చంద్రబాబు తనకు ఘోర పరాజయం తప్పదనే భయంతోనే బీజేపీ పంచన చేరారన్నారు. కామన్ సివిల్ కోడ్‌ను పక్కాగా అమలు చేస్తామని బీజేపీ స్పష్టం చేయడంతో ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నేరుగా వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక చంద్రబాబు బీజేపీని అడ్డం పెట్టుకుని అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ఆయన వ్యూహం ఫలించదన్నారు. నగరంలోని 43వ డివిజన్ పరిధిలో తమ ప్రభుత్వం డీబీటీ, నాన్‌బీపీటీ పథకాల ద్వారా రూ.37.78 కోట్ల లబ్ధి చేకూర్చిందని తెలిపారు. రూ.19 లక్షలతో రోడ్ల మరమ్మతులు, రూ.15 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామన్నారు. రూ.6.75లక్షలతో కల్వర్టుల నిర్మాణం, రూ.65లక్షలతో యాహ్యాళి వీధి, జెండావీధి, గరిసి వీధిలో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. గోషా ఆస్పత్రి నిర్మాణానికి 2019లో ముస్లిం సోదరుల అభ్యర్థన మేరకు పాతమున్సిపల్ ఆఫీస్ వద్ద భూమిని కేటాయించామన్నారు. 2023 నాటికి 70 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. జెండావీధి సమీపంలో డైకస్‌రోడ్డుకు రూ.10 కోట్లతో డివైడర్ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తొలిసారిగా నెల్లూరు లోక్‌సభకు పోటీ చేస్తున్న తనతో పాటు నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలి ముస్లిం ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌కు గుర్తింపు తేవాలన్నారు. ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ మైనార్టీలకు చంద్రబాబు మొండిచేయి చూపారన్నారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదుగురు ముస్లింలకు టికెట్లు ఇవ్వగా, అందులో నలుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొందారన్నారు. డిప్యూటీ సీఎం,మండలి డిప్యూటీ చైర్మన్‌తో పాటు నామినేటెడ్ పదవులను ముస్లింలకు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ జగనన్నను సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, ఎస్కే మీరా ఉద్దీన్, కార్పొరేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

అనిల్ విజయం కోసం ప్రార్థనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ విజయాన్ని ఆకాంక్షిస్తూ నగరంలోని 54వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా తెట్టులోని సయ్యద్ సుల్తాన్ బీబీ దర్గాలో బుధవారం వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నరసరావుపేటకు వెళ్లి అనిల్‌కు ప్రసాదాలను అందజేశారు. అనిల్‌ను కలిసిన వారిలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు జమీర్‌అహ్మద్, నాయకులు ఖయ్యూం, మస్తాన్, ప్రకాష్, అస్లాం, శోభన్‌బాబు, తదితరులు ఉన్నారు.



అనిల్‌ను కలిసిన 54వ డివిజన్ నాయకులు

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రధాన ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం విశేష పూజలు, అలంకారాలు, వాహనోత్సవాలు నిర్వహించారు.

- సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా కంచి మోహన్‌రావు, భాస్కర్, కృష్ణ, పీ పార్థసారథి దంపతులు వ్యవహరించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి మందిరంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం చప్పరోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా రూపినేని వెంకటేశ్వర్లు, మాధవి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనోత్సవం జరిపారు.
- రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పీవీ వీరరాఘవరావు, పావని దంపతులు వ్యవహరించారు.
- బారకాసు రామమందిరంలో వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా డాక్టర్ పాట్టెం శ్రీనివాసరావు,శివప్రియ దంపతులు వ్యవహరించారు.

నేత్రపర్వంగా అనంత కోదండరాముడి రథోత్సవం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అనంతకోదండరామస్వామి రథోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారామస్వామి మందిరం నుంచి ప్రారంభమైన రథోత్సవం గౌడ హాస్టల్ సెంటర్, ఉగాది సెంటర్, ఏసీనగర్ మెయిన్‌రోడ్డు, బాలాజీనగర్ మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి మందిరం చేరుకుంది. రథోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉభయకర్తలుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంధ్య దంపతులు వ్యవహరించారు. సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, మందిర కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.



సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో అశ్వవాహన సేవ



శబరిశ్రీరామక్షేత్రంలో సీతారాముల కల్యాణం

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

నెల్లూరు సిటీ: బుజబుజనెల్లూరులో ముస్లిం మైనార్టీ కుటుంబంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని 25వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎస్‌కే నవాబ్‌జాన్ డిమాండ్ చేశారు. బుధవారం బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలో ఎన్నికల ముందు హింసాత్మక చర్యలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్‌లో శాంతియుత వాతావరణాన్ని తీసుకొచ్చారని, రానున్న రోజుల్లో కూడా రూరల్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగేలా చూస్తారన్నారు. పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ ఖాదర్‌బాషా, బద్దెపూడి రవీంద్ర, హరియాదవ్, అలీ, జమీర్, కృష్ణంరాజు, మురళి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు

నెల్లూరు(అర్బన్): వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ జనరిక్ మందుల షాపు వద్ద మజ్జిగ చలివేంద్రం, ఆత్మకూరు బస్టాండ్ సెంటర్, ముత్తుకూరురోడ్డు ఫ్లయిఓవర్ కింద, మద్రాస్ బస్టాండ్ వద్ద తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. బిరదవోలు కౌసల్యమ్మ జ్ఞాపకార్థంగా దాతలు వెంకురెడ్డి, కోదండరామిరెడ్డి చలివేంద్రాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించారు. చలివేంద్రాల ఏర్పాటుకు మానవతా దృక్పథంతో ఎవరైనా సాయం అందించాలనుకుంటే రెడ్‌క్రాస్‌ను 96471 08108 నంబర్‌లో సంప్రదించాలని ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్ర కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రేబాల ఆస్పత్రి, డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేట రామాలయం రథోత్సవం కారణంగా ఉస్మాన్‌సాహెబ్‌పేట, రేబాలవీధి, ప్రకాష్‌నగర్, పప్పులవీధి, ఎన్టీఆర్ లేఅవుట్, స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. మూలాపేట వేణుగోపాలస్వామి రథోత్సవం సందర్భంగా డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని కొండదిబ్బ, అలంకార్‌సెంటర్, బ్రాహ్మణ వీధి, శివాలయం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

వలంటీర్ల రాజీనామా



నెల్లూరు సిటీ: రూరల్ మండలం కొండ్లపూడికి చెందిన 10 మంది గ్రామ వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మినీబైపాస్‌లోని కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తమ విధులను అడ్డుకోవడంతో స్వచ్ఛందంగా రాజీనామా చేశామని తెలిపారు. తమకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో నగరత్న, యశోదర, మాధవి, నవీన్, చందు, కిరణ్, నాగరాజు, సురేంద్ర, రాము, రామచంద్ర ఉన్నారు. కొండ్లపూడి నాయకులు దినేష్‌రెడ్డి, సునీల్, భాస్కర్, నరసయ్య తదితరులు ఉన్నారు.

ఆదాలకు విశ్రాంత ఉద్యోగుల మద్దతు



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతు తెలిపారు. బుధవారం వారు ఆదాలను మినీబైపాస్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తమ మద్దతు తెలిపారు. తమ సమస్యలను ఆదాలకు విన్నవించారు. స్పందించిన ఆదాల తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చిరువ్యాపారులకు అండగా వైఎస్సార్‌సీపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిరువ్యాపారులకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె తన తల్లి సునందారెడ్డితో కలిసి 45వ డివిజన్ జేమ్స్‌గార్డెన్, ఆత్మకూరు బస్టాండ్, రామ్మూర్తినగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ముదిరెడ్డి వేదవతి, డివిజన్ పార్టీ ఇన్‌చార్జి ముదిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చిరువ్యాపారులను ఆప్యాయంగా పలుకరిస్తూ ప్రచారం నిర్వహించారు. నెల్లూరు అభివృద్ధికి ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు రత్నం, శ్రీనివాస్, రమణ, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, పార్టీ మహిళా నాయకులు కర్తం జ్యోతి, వెంకటాచలం హిమబిందు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ నిబంధనలను ట్రేడ్‌లైసెన్స్‌లు పొందిన వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. బీవీనగర్‌లోని క్వాంటమ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సూచనలు చేశారు.

ఏడోరోజు 9 నామినేషన్లు దాఖలు



ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న ఖలీల్ సతీమణి నసీమా

నెల్లూరు(బారకాసు): నెల్లూరు సిటీ అసెంబ్లీ స్థానానికి ఏడో రోజు బుధవారం 10 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి/కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ తరఫున 8వ డివిజన్ కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, ఖలీల్‌అహ్మద్ సతీమణి ఎండీ నసీమా డమ్మీ అభ్యర్థిగా మరో నామినేషన్‌ను అందజేశారు. టీడీపీ తరఫున 4, బీఎస్పీ 2, ఇండిపెండెంట్లు 2 నామినేషన్లు దాఖలు చేశారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



పార్టీలో చేరిన వారితో ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- 30వ డివిజన్‌లో 300 మంది చేరిక

నెల్లూరు సిటీ: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి కొత్తూరు మాజీ సర్పంచ్ కండే శ్రీనివాసులు, ఆయన కుమారుడు కండే ఉమామహేష్ వారి అనుచరగణం 300 మందితో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా 30వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తూరు, శ్రామికనగర్ ప్రాంతాలకు చెందిన బుర్ల రామయ్య, కలగారెడ్డి, బీ రామచంద్రయ్య, వట్టికాయల హరి, కూకాటి వెంకయ్య, బత్తుల ప్రసాద్, నాగయ్య, మందాటి ప్రసాద్, కూకటి రమేష్, చక్రి, వెంకీ, అంజి, అహ్మద్, రిజ్వాన్, ఫజల్, రబ్బాని, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, షేక్ సత్తార్, జేసీఎస్ కన్వీనర్ కొండా సాయిరెడ్డి, తురక సూరిబాబు, స్వర్ణ వెంకయ్య, హరిబాబు యాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, వెంకటజ్యోతి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

నెల్లూరు సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలు ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారని ఆదాల హిమబిందు తెలిపారు. బుధవారం ఆమె తన తండ్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా రెండో డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ కోసం కాళ్ల అరిగేలా పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అమ్మఒడి, రైతుభరోసా, ఫీజురీయింబర్సుమెంట్, ఆసరా, మహిళలకు వడ్డీలేని రుణాలు, తదితర పథకాలను అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కాకుటూరు లక్ష్మీసునంద, పాశం శ్రీనివాస్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, ఒట్టూరు సుధాకర్‌యాదవ్, 2వ డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్, నాయకులు నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, 1వ డివిజన్ కార్పొరేటర్ జానానాగరాజ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, నెల్లూరు ప్రసన్నకుమార్‌రెడ్డి, మురళిరెడ్డి పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆదాల హిమబిందు

బీసీల పక్షపాతి సీఎం జగన్



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి రాము తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో తనకు చోటు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎంపీ విజయసాయిరెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తే చంద్రబాబునాయుడు బడుగులకు మొండిచేయి చూపారన్నారు. నాయీ బ్రాహ్మణులను చంద్రబాబునాయుడు అవమానిస్తే జగనన్న గౌరవాన్ని కల్పించారన్నారు. జిల్లాకు చెందిన బీసీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌కు క్యాబినెట్‌లో చోటు కల్పించడమే అందుకు నిదర్శనమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నారన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ ఖాయమన్నారు.

మాయా కూటమితో మోసం



నెల్లూరు(దర్గామిట్ట): బీజేపీ, టీడీపీ, జనసేనది ఓ మాయా కూటమి అని, చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేయడానికి మాయా కూటమితో పన్నాగం పన్నుతున్నారని, ప్రజలు గమనించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, శ్రీకాంత్ తెలిపారు. మాగుంటలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తాము 21 ఏళ్ల పాటు పవన్ కళ్యాణ్‌తో కలిసి పనిచేశామని, తాను చంద్రబాబుకు బానిసగా మారాడని ఆరోపించారు. భగత్‌సింగ్, చేగువేరా ఆశయాలు వట్టి మాటలేనన్నారు. గతంలో టీడీపీని గద్దె దించాలన్న పవన్ మళ్లీ ఆ పార్టీతోనే జత కట్టాడన్నారు. కాపులకు వెన్నుపోటు పొడిచిన పవన్, మాయమాటలు చెప్పే చంద్రబాబును తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

1 నుంచి క్రికెట్ సమ్మర్ క్యాంప్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో మే 1 నుంచి 30వ తేదీ వరకు 'సమ్మర్ క్యాంప్' నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

రాక్ స్కూల్ వార్షికోత్సవం

నెల్లూరు(అర్బన్): కొత్తూరు, అంబాపురంలోని రాక్ స్కూల్‌లో వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన గాయత్రిని సత్కరించారు. గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపల్ ప్రశాంతిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.